# సద్యోగం

"అభిషేక్ వచ్చి గృహప్రవేశానికి పిల్చివెళ్ళాడు." రాధ చెప్పింది గుర్తుకొచ్చినట్లు.

"అభిషేక్ – గృహప్రవేశం – ?!" ఆశ్చర్యపోతూ అడిగాడు కృష్ణ.

"మరి అందరూ మీలాగా అన్నీజెప్పుకుంటారూ! సైలెంట్‌గా పనులుచేసేస్తారు. మీరూ ఉన్నారు. ఇల్లు కట్టాలని పదేళ్ళుగా ప్రయత్నిస్తున్నారు. మీరు కనీసం స్థలం అయినా కొనలేకపోయారు!" సాధిస్తూ ఆహ్వానం అందించింది.

కృష్ణ దాన్ని పరిశీలనగా చూశాడు. హైదరాబాద్‌లో ఓ పోష్ లొకాలిటీలో ఇల్లు – అభిషేక్ కట్టించాడు. ఎల్లుండి గృహప్రవేశం. ఆ ఏరియాలో స్థలంకొనాలన్నా కొన్ని లక్షలతోపని.

కృష్ణ, అభిషేక్ ఒకే స్కూల్లో చదువుకొన్నారు. కృష్ణ చదువులో బాగా పైకొచ్చి ఎం. ఏ. పాసై ఓ స్కూలు టీచర్ కాగలిగాడు. అభిషేక్ డిగ్రీ అత్తెసరు మార్కులతో పాసై, ఉద్యోగం దొరక్క, చిల్లరమల్లర పనులు చేస్తూ ఆఊరు, ఈ ఊరు తిరుగుతూ ఉంటాడు. ఓ పదేళ్ళు అతనిగురించి పట్టించుకోలేదు. కానీ ఈమధ్య తను ఆఫీసుకుపోతూ, వస్తూ ఉండే దారిలో అతను ఇల్లు అద్దెకు తీసుకొనడంతో అడపాదడపా అతను తారసపడటం, తను మాట్లాడటం జరుగుతుండేది. అలా మళ్ళీ స్నేహం తిరిగి చిగురించింది.

"ఎప్పుడూ నువ్వే కనిపిస్తావు? మీ ఆవిడ, పిల్లలు కనపడరేం?" ఓ రోజు కుతూహలం ఆపుకోలేక అడిగాడు కృష్ణ.

"ఆమె వాళ్ళనాన్నకు ఒకే కూతురు. ఆయనకు ఒంట్లో బాగోలేదు. అందుకే పుట్టింట్లో ఉంది. ఏం చేస్తాం? పెళ్ళయినంత మాత్రాన పుట్టింటిమీద మమకారం చంపుకోలేరుకదా! అక్కడేఉంది." ఓ గొప్ప తత్వవేత్తలా చెప్పాడు అభిషేక్.

తరువాత, తరువాత గమనించగా అతనికోసం చాలామంది వచ్చి వెళుతూండటం గమనించాడు. చాలా రోజులు ఇల్లు తాళంకూడా వేసిఉండేది.

ఓ రోజు హఠాత్తుగా ఇంటికి వాసు వచ్చాడు. వాసు బాల్యస్నేహితుడు. ఓగవర్నమెంట్ ఉద్యోగం వెలగబెడుతు ఓ మారుమూల గ్రామంలో ఉంటున్నాడు. పనులమీద కర్నూలుకు వచ్చినా కాళ్ళు చెప్పుల్లో పెట్టుకుని వెళ్ళిపోతూఉండేవాడు.

కృష్ణ ఆనందంగా వాసునుఆహ్వానించి చిన్ననాటి ముచ్చట్లు నెమరువేసుకొన్నాడు.

"ఇంతకీ నువ్వు వచ్చినపని చెప్పలేదు?" అడిగాడు.

"మాతమ్ముడికి ఉద్యోగం వేయిస్తానన్నారు."

"ఏం ఉద్యోగం?" ఆసక్తిగా అడిగాడు. ఇటువంటి విషయాలు కృష్ణకు కొత్త.

"ఏముంది. కాలం మారిపోయిందిగదా. పూర్వంలా అప్లయ్ చేయగానే ఉద్యోగాలురావుకదా. దానికోసం ప్రయత్నంచేయాలిగదా, ఆప్రయత్నం మీద... వాసు చెప్పాడు.

అయినా కృష్ణ వదల్లేదు.

"అదేంటోయ్! నువ్వు చాకువుకదా. మీతమ్ముడు మంచి తెలివి గలవాడే అయిఉండాలి. మెరిట్ లేదా క్వాలిఫికేషన్ లేదా? మళ్ళీ ట్రై చేసుకోవడం ఏమిటి ? అంటే రికమెండేషనా..?"

"కృష్ణా ! నువ్వు మరీ సత్తెకాలం సత్తెయ్యలా మాట్లాడితే నేనేంచెప్పేది... ఓ లెక్చరర్ జాబ్ ఇప్పిస్తానని అన్నాడు...ఉండే ఒక పోస్టుకు ఎంతో కాంపిటీషన్, మినిస్టర్ రికమెండేషన్‌తో రావాలి"!

"రికమెండేషనా. మినిస్టర్‌తో. అంత పలుకుబడి పెరిగిపోయిందీ!" నవ్వాడు - "డబ్బులేదుగదా, అంతవరకుఫర్వాలేదు."

"బాబూ! ఇప్పటికి ఓ యాభైవేలు ఖర్చయింది. ఇంతవరుకు అలూలేదు చూలూలేదు." వాసు బాధగా చెప్పాడు.

కృష్ణ దిమ్మెరపోయాడు. యాభైవేలు!

"ఎవరు? ఎవరికిచ్చావు?"

"మేనేజ్‌మెంట్‌కి ఇస్తానని తీసుకొన్నాడు. ఇచ్చేఉంటాడు అభిషేక్!"

"అభిషేక్! వాడిమొహం. వాడికేంతెలుసు. తాడు, బొంగరంలేనివాడు?" నిర్ఘాంతపోతూ అడిగాడు.

"రాజకీయాల్లో తిరుగుతుంటాడు. అందరూ తెల్సుగా. చిటికెలో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. చిటికెవేసే ఆర్నెల్లయింది. కారణం ఏదో చెబుతుంటాడు. గ్యారంటీగా వస్తుందంటాడు. కావాలంటే డబ్బు వాపసు ఇస్తానంటాడు. మూడురూపాయల వడ్డీ. ఇన్నాళ్ళు కట్టిన వడ్డీ వేస్టవుతుందికదా, డబ్బు వాపసు తీసుకొంటే..పైగా కావలసింది ఉద్యోగం. దొరికిన లింకులు ఎందుకు పోగొట్టుకోవాలి?" వాసు చెప్పాడు.

మరునాడు వెళ్ళిపోయాడు

అభిషేక్ ఇల్లు కట్టాడన్నది జీర్ణంకాని సత్యంకాబట్టి కృష్ణ వేరేపనులు పెట్టుకొని హైదరాబాద్ కు వచ్చి గృహప్రవేశంకు హాజరయ్యాడు.

ఆ ఇల్లు చూడగానే కృష్ణ తల తిరిగి పోయింది. అది ఇల్లుకాదు. బంగాళా. కాదు, కాదు. ఒక ఇంద్రభవనం. కిందా, పైనా రెండు అంతస్తులు. మూడు వేల అడుగులపైన ఉంది ఇల్లు! చక్కటి కాంపౌండ్, తోట... ఓహ్!

భోజనాలై కాస్త సందడి పలచబడిన తర్వాత సెలవు తీసుకోవటానికి, విశ్రాంతి తీసుకొంటున్న అభిషేక్ నిఅడిగాడు కృష్ణ.

"ఇల్లు బాగుంది చాలా. మామగారు ఇచ్చారా?"

"కష్టార్జితం! ఒకళ్ళ దయా భిక్షలకు యాచించనుగా. తెలుసుకదా, నాప్రిన్సిపుల్ నీకు". గర్వంగా చెప్పాడు.

"వాసూ వస్తాడనుకొన్నాను. రాలేదేంటో.." అన్నాను.

"వాసూ ! ఓ! వాసూనా. వాడా వాడు పైసా ఖర్చుపెట్టడుగా. ఇంతదూరం రెండొందలు ఖర్చుపెట్టివస్తాడా?" చాలా హేళనగా అన్నాడు అభిషేక్.

"వాళ్ళ తమ్ముడికి ఉద్యోగం వచ్చిందా? "కృష్ణ అడిగాడు.

"డబ్బు ఖర్చుపెట్టడు. ఉద్యోగంకావాలి. పైగా లెక్చరర్ ఉద్యోగం. వట్టి పిసినారి. అయినా స్నేహితుడు కదా అని ప్రయత్నిస్తున్నాను నేను..." త్యాగమూర్తిలా అన్నాడు అభిషేక్.

కృష్ణ సెలవు తీసుకొని బయలుదేరాడు. దారిలో అతనికి స్ఫురించింది. వండుకున్నమ్మకు ఒక ఇల్లు. ఉద్యోగాన్ని నమ్ముకుంటే ఒక నెలజీతం.. అదే దానిని అమ్ముకుంటే వస్తుంది-కానీ.. అభిషేక్‌ను తలుచుకొంటూ తనలోతాను అనుకొన్నాడు కృష్ణ. ★

(ఆదివారం ఉదయం 20-11-94)